మానవాళి ప్రగతికి చెట్లే జీవనాధారం

- ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలి
- డ్వామా పీడీ రామసుబ్బయ్య



జూపాడుబంగ్లాలో మొక్క నాటి నీరు పోస్తున్న డ్వామా పీడీ రామసుబ్బయ్య

జూపాడుబంగ్లా: మానవాళి ప్రగతికి చెట్లే జీవనాధారమని, ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలని డ్వామా పీడీ రామసుబ్బయ్య సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఎంపీపీ సువర్ణమ్మతో కలిసి పీడీ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో గాలిలో కార్బన్‌డైయాక్సైడ్ శాతం పెరుగుతూ ప్రజలు పలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిపరిసరాల్లో ఓ మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బషీర్, డీటీ నాగన్న, ఏపీఓ రేష్మ, సెరికల్చర్ టీఏ కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు

పచ్చదనం.. పరిశుభ్రత అందరి బాధ్యత

పగిడ్యాల: పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సచివాలయం-1 ఆవరణంలో మొక్కలు నాటారు. నెహ్రూనగర్, సంకిరేణిపల్లె, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం. ఘణపురం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అధికారులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు సాధన చేశారు.

● **పాములపాడు:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద, ఇస్కాల గ్రామంలోని ప్రధాన రహదారికిరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ అలివేలిమంగమ్మ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **వెలుగోడు:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఎంపీడీఓ, అటవీ శాఖ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంఈఓ బ్రహ్మం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **బండి ఆత్మకూరు:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ ఎం.దస్తగిరి, ఈఓఆర్‌డీ రామకృష్ణవేణి, ఏపీఓ వసుధ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ పాల్గొన్నారు. అలాగే నారపురెడ్డి కుంట గిరిజన గూడెంలో ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్ రెడ్డి గిరిజనులకు పండ్లు, కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.

● **శ్రీశైలంటెంపుల్:** స్థానిక ఏనుగుల చెరువుకట్ట వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, పర్యవేక్షకురాలు కె.గిరిజామణి, డీఈఈ పి.చంద్రశేఖరశాస్త్రి, ఉద్యానవన అధికారులు ఈశ్వరరెడ్డి, లోకేష్, ఏఈ సీతారమేష్ పాల్గొన్నారు.

● **మహానంది:** ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ కూరపాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి పాల్గొన్నారు.

కొలనుభారతి క్షేత్రం వద్ద..

కొత్తపల్లి: మండలంలోని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దుద్యాలలో ఎంపీడీఓ మేరి, ఏపీఓ విమలమ్మ, కొలను భారతిదేవి ఆలయం వద్ద తహసీల్దార్ ఉమారాణి, ఎఫ్ఆర్వో పట్టాభి, అటవీశాఖ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. కొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ, తహసీల్దార్, ఏపీఓ, ఏఓ మహేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్‌లు మొక్కలు నాటారు.



కొలనుభారతి క్షేత్రం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



నందికొట్కూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పర్యావరణం కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం మొక్కలు పెంచాలన్నారు. అలాగే శాతనకోట గ్రామంలో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య మొక్కలు నాటారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ సుభాన్ ఉన్నారు.

■భక్తిశ్రద్ధలతో అంజన్న విగ్రహ ప్రతిష్ట



మిడుతూరు మండల కేంద్రంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 40 అడుగుల ఏకశిల ఆంజనేయ స్వామి విగ్రహంతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
– నందికొట్కూరు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఆత్మకూరు: పర్యావరణాన్ని పరిరక్షించాలని హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు.

పనిగంటల పెంపు దుర్మార్గం

ఆత్మకూరు: పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామన్ నాయక్, సురేంద్ర విమర్శించారు. గురువారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న స్వామి వారు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి గురువారం తూర్పుగోదావరికి చెందిన వి.పుల్లయ్య, రత్నావతి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు జి.రవికి అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

శుభకార్యం



ఆత్మకూరు: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్యాల వెంకటరెడ్డి కుమార్తె వివాహ వేడుకలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

శిలాఫలకం ధ్వంసం



పగిలిపోయిన శిలాఫలకం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసమైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఆ వివరాలను తెలుపుతూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మహానంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


గంగమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

వెలుగోడు: మండల పరిధిలోని తిమ్మనపల్లిలో గురువారం గంగమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో పురోహితులు మధుశర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు బల్లాని వెంకట సత్యనారాయణ, లాలం సుధాకర్ గంగమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఇసుక టిప్పర్ బోల్తా



బోల్తాపడిన ఇసుక టిప్పర్

బేతంచెర్ల : మండల పరిధిలోని గోర్ల గుట్ట గ్రామ సమీపాన ఉన్న బ్రిడ్జి వద్ద గురువారం ప్రమాదవశాత్తు ఇసుక టిప్పర్ బోల్తాపడింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఇసుక లోడుతో బేతంచెర్ల వైపు వస్తున్న టిప్పర్ గోర్లగుట్ట బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దేవరంగకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో బేతంచెర్లకు తరలించారు. ఆసమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

జీవన శైలిలో యోగా భాగమవ్వాలి



యోగాసానాలు వేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమవ్వాలని ఎంపీడీఓ మేరి, ఎంఈఓ-2 ఇనాయతుల్లా సూచించారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, పీఈటీలు చంద్రశేఖర్, మురళీనాయక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆత్మకూరు జట్టు



ట్రోఫీ అందుకున్న ఆత్మకూరు జట్టు

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో నిర్వహించిన సమ్మర్ స్పెషల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆత్మకూరు పవర్ హిట్టర్ జట్టు విజేతగా నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఆత్మకూరు – వేల్పనూరు జట్లు తలపడ్డాయి. ఆత్మకూరు పవర్ హిట్ జట్టు విన్నర్‌గా నిలిచింది, ఈ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వేల్పనూరు జట్టుకు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన పారుమంచాల జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు.

ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఆకట్టుకున్న చెక్కభజన

కొత్తపల్లి: మండల పరిధిలోని బట్టువారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాపరమేశ్వరి, పోతురాజు సహిత నాభిశిల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో రెండవ రోజు గురువారం ఉత్సవమూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, ప్రభాతపూజ, అభిషేకాలు, యంత్రజపములు, దీక్షాహోమం, ఆవాహితా దేవతా హోమాలు పండితులు నిర్వహించారు. సాయంకాలం సమయంలో గ్రామదేవత, పరివారదేవతల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాదివాసం, రక్షాహోమం, దీక్షాహోమం, ప్రదోష పూజ, మంగళ హారతి, పుష్పనీరాజనం, తీర్థప్రసాద వినియోగం, ఆశీర్వచనం వంటి విశేష పూజలు చేశారు. గ్రామోత్సవంలో చెక్కభజన ఆకట్టుకుంది.

బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న లెక్చరర్ సురేష్‌నాయుడు

పగిడ్యాల: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిసినట్లు లైబ్రేరియన్ మద్దమ్మ తెలిపారు. చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్, క్రికెట్ తదితర క్రీడలతోపాటు నీతి కథలను బోధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు లెక్చరర్ సురేష్‌నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు, గ్రంథాలయ అధికారి మురళి

నందికొట్కూరులో..

నందికొట్కూరు: సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ప్రతిభా చాటడం గర్వకారణమని గ్రంథాలయ శాఖ అధికారి మురళి అన్నారు. గురువారం 40 రోజుల పాటు జరిగిన సమ్మర్ క్యాంపులో మ్యాథ్స్, ఇంగ్లీషు పరీక్షల్లో ప్రతిభా కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను దాతలు అందజేశారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు



తాటిపాడు సమీపంలో రోడ్డుపై నిర్మించిన అండర్‌పాస్ వంతెన



పగుళ్లకు సిమెంట్ పూతపూసిన దృశ్యం

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా తాటిపాడు గ్రామ సమీపంలో నిర్మించిన అండర్‌పాస్ వంతెన ప్రారంభానికి ముందే పగుళ్లిచ్చింది. చిన్నపాటి వర్షం కురిసినా పగుళ్ల నుంచి వర్షం నీరు కారుతుండటంతో వంతెన నాణ్యతపై ఇంజినీరింగ్ నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పీఎస్‌కే కంపెనీ పనులను సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించి చేతులు దులుపుకోవడంతో వారు నాసిరకంగా పనులు చేశారనే విమర్శలున్నాయి. వంతెనను నాసిరకంగా నిర్మించటంతో పాటు క్యూరింగ్ కూడా సక్రమంగా చేయకపోవటంతో పగుళ్లు ఇచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పర్యవేక్షణాధికారులు అండర్‌పాస్ వంతెనను పరిశీలించి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు

వెలుగోడు: పట్టణంలోని ప్రధాన రహదారి, సెంటర్ల వద్ద వాహనాలను నిలిపితే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై నిలిపిన వాహనాలను తొలగించారు. పలు రూట్లలో ట్రాఫిక్‌ను పరిశీలించిన అనంతరం ఆయన వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ, అభయాంజనేయస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి, లక్ష్మీదేవి, ఆంజనేయ స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు నిర్వహించారు. రాత్రి భక్తుల చేత భజన కార్యక్రమం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి

కొత్తపల్లి: వీధి కుక్క దాడిలో ఓ చిన్నారి స్వల్పంగా గాయపడింది. వెంటనే స్థానికులు స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. చిన్నారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శివపురం గ్రామానికి చెందిన శ్రీహిత ఉదయం రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా ఓ వీధి కుక్క దాడి చేసింది. అక్కడే ఉన్న కొందరు వెంటనే కుక్కను తరమడంతో బాలికకు ప్రమాదం తప్పింది.

శ్రీశైలంలో పారిశుద్ధ్య పనులు



వీధులు శుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రథశాల నుంచి నందిమండపం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షేత్ర పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రదేశాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఏఈఓలు మల్లికార్జునరెడ్డి, హరిదాసు, పర్యవేక్షకులు, పలు విభాగాల సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

టి.లింగందిన్నెలో అగ్ని ప్రమాదం

రుద్రవరం: మండల పరిధిలోని టి.లింగందిన్నెలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించడంతో రేకుల షెడ్డు, వస్తు సామగ్రి కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వెంకటసుబ్బయ్య అనే రైతు తన రేకుల షెడ్డులో 250 గడ్డి చుట్టలు, 15 బస్తాల రసాయన ఎరువుల బస్తాలు నిల్వ ఉంచాడు. అయితే గుర్తు తెలియని దుండగులు గడ్డి చుట్టలకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి గడ్డి, వస్తు సామగ్రి కాలిపోయాయి. ప్రమాదంలో రైతుకు దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

బేతంచెర్ల: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు భార్య సావిత్రి 10 రోజుల క్రితం భర్తతో గొడవ పడి పట్టిళ్లు అయిన మహానంది మండలం బసాపురానికి వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన బోయ వెంకటేశ్వర్లు(30) గురువారం పేడ రంగు ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జీవనోపాదులు మెరుగుపర్చుకోవాలి



పొదుపుమహిళలకు సూచనలిస్తున్న ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: బ్యాంకులు, శ్రీనిధి, గ్రామైఖ్య సంఘాల్లో పొందిన రుణాలతో జీవనోపాదులు మెరుగుపర్చుకోవాలని ఏపీఎం అంబమ్మ పొదుపు మహిళలకు సూచించారు. గురువారం పారుమంచాల గ్రామంలో ప్రశాంతి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొదుపు మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ నాగేశ్వరరావు, వీఓఏ నాగశేషమ్మ పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

వెలుగోడు: బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం రోఖియాబీ దర్గా ప్రాంతంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గోవధ చేయకూడదని, ఎవరైనా పశువులు తరలిస్తే సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదన్నారు. సామరస్య పూర్వకంగా పండుగ జరిగేలా హిందూ, ముస్లిం సోదరులు సహకరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, శాంతి కమిటీ సభ్యులు మోమిన్ రసూల్, ఇలియాస్ ఖాన్, ఇదయతుల్లా, లాయర్ సిద్ధిక్ అహ్మద్, తెలుగు శ్రీను, గోవిందు పాల్గొన్నారు.

● **మహానంది:** బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి కోరారు. పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం శాంతియుత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పండుగను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి

ఆత్మకూరు: వ్యవసాయాధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, ఆదినారాయణ రైతులకు సూచించారు. గురువారం నల్లకాలువ, బాపనంతపురం, పిన్నాపురం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. మొక్కజొన్న, కంది, వరి, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు, విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆత్మకూరు బి.ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా తగిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో నల్లకాలువ, వెంకటాపురం, బాపనంతపురం సర్పంచ్‌లు వెంకటరమణ, గంగాదేవి, దర్గయ్య పాల్గొన్నారు.

– **బండి ఆత్మకూరు:** బండి ఆత్మకూరు, సంతజూటూరు రైతు సేవ కేంద్రాల్లో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ మురళీకృష్ణ, యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి ఎం స్వాతి, సర్పంచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణదుర్గంలో ధర్మప్రచారం



కల్యాణదుర్గంలో స్వామిఅమ్మవార్ల శోభాయాత్ర



స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం

శ్రీశైలంటెంపుల్: హిందూ ధర్మప్రచారంలో భాగంగా గురువారం శ్రీశైల దేవస్థాన ధర్మప్రచారం ద్వారా అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో స్వామిఅమ్మవార్ల శోభయాత్ర, కల్యాణోత్సవం జరిపించారు. కల్యాణదుర్గంలోని వాల్మీకి కూడలి నుంచి బజవేశ్వర స్వామి ఆలయం వరకు శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. కోలాటం, గొరవయ్యల నృత్యం, డోలు వాయిద్యాలు, పలు జానపద కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి బసవేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామిఅమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతోపాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ



క్షతగాత్రులతో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు: కర్నూలులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పరామర్శించారు. ఇటీవల నందికొట్కూరు హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎల్లా గౌడ్, రహీం బాషా గాయపడి కర్నూలులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణిరెడ్డి ఆస్పత్రులకు చేరుకుని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. శిల్పా వెంట పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, పక్కీర్ ఉన్నారు.